సాక్షి శ్రీకాకుళం

గురువారం ı 4 ı సెప్టెంబర్ ı 2025



భద్రం బీ కేర్ ఫుల్ బ్రదరూ..!

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకుల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. - 8లో



చేతబడి నెపంతో వృద్ధుడి హత్య

కేశుపురం గ్రామానికి చెందిన వృద్ధుడు ఉంగ రాములు దారుణ హత్యకు గురయ్యాడు. చిల్లంగి చేస్తున్నాడనే నెపంతో అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు చంపేశారు. - 8లో

9న ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన వివిధ విభాగాల్లో సబ్జెక్ట్ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ఖాళీల భర్తీకి ఈ నెల 9న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత బుధవారం తెలిపారు. సీఎస్ఈ, ఎంసీఏ కోర్సుల్లో 6, ఈసీఈలో 4, మెకానికల్‌లో 2, సివిల్‌లో 2, మైక్రోబయాలజీలో ఒక పోస్టును భర్తీ చేస్తామని, వివరాలకు క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కేసులు పెడితే దోషులవుతారా?

- మాజీ మంత్రి ధర్మాన ధ్వజం
- ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి, రాజమహేంద్రవరం/శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం ఎంపీ మిథున్‌రెడ్డిని దోషిగా ప్రచారం చేస్తోందని, ప్రభుత్వం కేసులు పెట్టినంత మాత్రాన దోషి ఎలా అవుతారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ మంత్రి ధర్మాన బుధవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట ధర్మాన మీడియాతో మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై కేవలం కొన్ని ఆరోపణలు మాత్రమే వచ్చాయన్నారు. న్యాయవ్యవస్థ దోషి అని నిర్ధారించలేదన్నారు. ప్రభుత్వం కేసులు పెట్టిన వారంతా దోషులు కారని చెప్పారు. న్యాయ వ్యవస్థ నిర్ధారించేంత వరకు వ్యక్తిగానే చూడాలన్నారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో ప్రతి కుటుంబంతో వారికి మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఇంతవరకు తుది చార్జిషీట్ వేయలేదన్నారు. చార్జీషీటు వేస్తే బెయిల్ వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయంతో మిథున్‌రెడ్డి ఉన్నారన్నారు. ములాఖత్ అయిన వారిలో ధర్మానతో పాటు ఎమ్మెల్సీ నర్తు రామారావు, మామిడి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

బార్లకు రీ-నోటిఫికేషన్

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీ 2025–28లో భాగంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు ప్రకటన విడుదల చేశారు. గత నెల 19 బార్లకు రెండు సార్లు (ఓపెన్, రిజర్వ్ క్యాటగిరీ) వేర్వేరు నోటిఫికేషన్లు రిలీజ్ చేసిన ప్రభుత్వం లాటరీ పద్ధతిలో డ్రా తీసేందుకు దరఖాస్తులు కోరగా ఐదు బార్లకే అనుకున్న స్థాయిలో దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. మిగిలిన 14 బార్లలో శ్రీకాకుళం 6, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురాల్లో రెండేసి చొప్పున ఉన్న వాటికి ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీసి లైసెన్సుదారులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలుగా నిర్ణయించారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

కిరాణాషాపులో ఎరువులు పట్టివేత



నారువలో పట్టుబడిన యూరియా, ఎరువులు

రణస్థలం/శ్రీకాకుళం క్రైమ్: నారువ గ్రామంలో మామిడిపాక వెంకట సత్యనారాయణ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన 25 బస్తాల యూరియా, ఎరువులను విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ డి.వి.వి.సతీష్ కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా 14 బస్తాల యూరియా, 11 బస్తాల పోటాషియం, అమ్మోనియా వంటి ఇతర ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వీటి విలువ రూ. 41వేలు ఉంటుందని చెప్పారు. విజిలెన్స్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎస్సై రామారావు, రణస్థలం వ్యవసాయ ఏవో డి.విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఎరువులను బ్లాక్‌మార్కెటింగ్ చేస్తే చర్యలు తప్పవని, ఇప్పటికే దళారులపై నిఘా ఉంచామని విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు స్పష్టం చేశారు.



నందిగాం మండలం కవిటి అగ్రహారం వద్ద రైల్వే అండర్ పాసేజ్‌లో వర్షం నీరు ఆరు అడుగుల మేర చేరిపోవడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. – వజ్రపుకొత్తూరు

వానొస్తే అవస్థే..!

వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి ప్రాథమిక పాఠశాల గదుల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో మోటారు సాయంతో నీటిని బయటకు పంపించాల్సి వచ్చింది. పిల్లలు కూడా తమవంతు సాయంగా నీటిని తోడారు. – వజ్రపుకొత్తూరు రూరల్



మద్యం డూప్లికేటుగాళ్లు



- అవలింగిలో అనుమానిత మద్యం బాటిళ్లు లభ్యం
- టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి అద్దెకు తీసుకున్న ఇంట్లో దందా
- మద్యంలో ప్రమాదకరమైన ఆల్కహాల్ ఉందా?
- అది తాగితే ప్రాణాలకే ముప్పా..!
- లోతుగా విచారిస్తే వాస్తవాలు బయటికొచ్చే అవకాశం

వాస్తవాలు బయటికొస్తాయా?

టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న నీలకంఠం అద్దెకు తీసుకున్న ఇంట్లోనే నకిలీ మద్యం బాటిళ్లు దొరకడంతో వాస్తవాలు బయటికొస్తాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈయన జిల్లాలో కీలక నేత సోదరుడికి సన్నిహితంగా ఉంటాడని.. ఆయన ఏదో ఒకటి చేస్తారన్న సందేహాలు ఉన్నాయి. అదే జరిగితే కుట్ర బయటికొచ్చే అవకాశం ఉండదు. నకిలీ మద్యం కేసు నీరుగారే అవకాశం ఉంది. ల్యాబ్‌కు పంపించిన దగ్గరి నుంచి వచ్చే రిపోర్టు వరకు ఎంతవరకు పారదర్శకత, స్పష్టత ఉంటుందో చూడాలి. ఈ విషయంలో ఎవరు రాజీ పడినా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడినట్టే అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

సారవకోట మండలం అవలింగి సమీపంలోని దుర్గా వైన్ షాపులో నకిలీ మద్యం బాటిళ్లు దొరికాయి. ఆ షాపులో పనిచేస్తున్న అనధికార నౌకర్ నామాలిచ్చిన సమాచారంతో సమీపంలోని ఓ ఇంట్లో తనిఖీలు చేయగా అక్కడ కూడా అదే రకమైన మద్యం బాటిళ్లు దొరికాయి. టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న నీలకంఠం అనే వ్యక్తి, దుర్గా వైన్‌షాపులో నౌకర్ నామాగా పనిచేస్తున్న పైడిరాజు కలిపి ఆ ఇల్లు అద్దెకు తీసుకున్నారు. వాస్తవంగా ఈ షాపు లైసెన్సు యజమాని శంకర్ అనే వ్యక్తి. తనిఖీల్లో మాత్రం అనధికారికంగా పనిచేస్తున్న వ్యక్తులు దొరికారు. అసలైన వ్యక్తులు పరారీలో ఉన్నారు. లోతుగా విచారిస్తే గుట్టు రట్టు అయ్యే అవకాశం ఉంది. ఇక్కడ జరుగుతున్న గూడుపుఠాణి, కుట్ర ఏంటో తెలియదు గానీ ప్రమాదకరమైన మద్యం దొరికినట్టు తెలుస్తోంది.

ఆ ఇద్దరు దొరికితేనే...

నకిలీ మద్యానికి ప్రధాన సూత్రధారి నీలకంఠం, పైడిరాజు అని అధికారులు భావిస్తున్నారు. వారి కోసం వెతుకుతున్నారు. ఆ ఇద్దరు దొరికితే అసలు అది ఏ మద్యం? ఏం చేశారు? ఎక్కడి నుంచి వచ్చింది? అన్న వివరాలు బయటపడతాయని ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి చెబుతున్నారు. పట్టుబడ్డ మద్యం ల్యాబ్‌కు పంపించి, రిపోర్టు వచ్చాక క్లారిటీ వస్తుందని.. నకిలీ మద్యం బాటిళ్లు దొరికినందున దుర్గా వైన్ షాపు లైసెన్సుదారుడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, సస్పెండ్ చేసి, అవసరమైతే లైసెన్సు కూడా రద్దు చేస్తామని 'సాక్షి' వివరణలో వెల్లడించారు.

పెద్దకుట్రే..

నకిలీ మద్యం వెనక కుట్ర ఉందని తెలుస్తోంది. ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా స్పష్టమవుతోంది. ఒక ఇల్లు తీసుకుని గుట్టుగా వ్యవహారం నడుపుతున్నట్టు స్పష్టమవుతోంది. టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న నీలకంఠం అనే వ్యక్తి దీనికంతటికీ సూత్రధారి అని తెలుస్తోంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యంలో నీరు, ఖరీదైన మద్యంలో చీప్ లిక్కర్ కలిపితే కల్తీ మద్యమవుతుంది. కల్తీ మద్యం కంటే ప్రమాదకర కెమికల్స్ నకిలీ(డూప్లికేట్) మద్యంలో ఉండటం వల్ల మందుబాబుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది. జిల్లా సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ఆల్కహాల్ కంపెనీలు ఉన్నాయి. అక్కడ 20 లీటర్ల ఆల్కహాలు క్యాన్‌లు విరివిగా విక్రయిస్తుంటారు. వాటిని ఇక్కడికి తెచ్చి కూల్‌డ్రింక్‌లో కలిపే కలర్ మాదిరిగా కలర్ లిక్విడ్‌లు కలిపి మద్యం తయారు చేస్తున్నట్టు వాదనలు ఉన్నాయి. ఇలా తయారు చేసే మద్యం అత్యంత ప్రమాదకరం. కల్తీ మద్యం తాగితే కొంత బతుకుతారు. నకిలీ మద్యం తాగితే మనిషి చనిపోయే ప్రమాదముంది.

జిల్లా అంతటా విస్తరించిందా?



అవలింగిలో దొరికిన నకిలీ మద్యం బాటిళ్లు

అధికారులకు దొరికిన అనుమానిత మద్యం బాటిళ్లు అక్కడికే పరిమితమయ్యాయా? జిల్లా అంతటా అందుబాటులోకి వచ్చాయా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న నీలకంఠం అద్దెకు తీసుకున్న ఇంట్లోనే ఈ బాటిల్స్ దొరకడం, పక్కనే ఉన్న దుర్గా వైన్స్‌లో ఇవే రకమైన మద్యం బాటిల్స్ దొరకడంతో సందేహాలకు తావిస్తోంది. అంత పెద్ద రిస్క్ తీసుకున్నారంటే జిల్లా అంతటా ప్రమాదకరమైన మద్యం దందా నడుపుతున్నారని భావించడానికి అవకాశం ఉంటుంది. ఇక్కడొక్కదగ్గరే దాదాపు 206 లీటర్ల నకిలీ మద్యం దొరికినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన మిగతా ఏరియాలో ఎంత ఉండవచ్చో అన్న అనుమానాలు ఉన్నాయి.



టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న నీలకంఠం అద్దెకు తీసుకున్న ఇంట్లో దొరికిన మద్యం బాటిళ్లు

ప్రభుత్వ భవనాల కూల్చివేత దారుణం

- పంచాయతీ భవనాన్ని వెంటనే పునర్నిర్మించాలి
- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్



కూల్చేసిన భవనం స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రం పాతపట్నంలోని పంచాయతీ భవనాన్ని కూల్చివేయడం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ కార్యాలయం భవనం కూల్చివేసిన స్థలాన్ని బుధవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ భవనం, స్థలం ప్రజలు ఆస్తి అని, ఏ ఒక్క పార్టీది కాదన్నారు. అధికారులు ముందస్తుగా ప్రజలకు తెలియజేయకుండా భవనం కూల్చివేయడం సరికాదన్నారు. ఈ స్థలం దాతలు విరాళంగా ఇచ్చారని చెప్పారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారని, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్న క్యాంటీన్ కోసం ఎటువంటి అనుమతి లేకుండా పంచాయతీ కార్యాలయం కూల్చివేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాత్రికి రాత్రే భవనం కూల్చివేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీ భవనాన్ని వెంటనే పునర్నిర్మించాలన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆమెతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు ఏనుగుతల సూర్యం, యరుకోల వెంకటరమణ, గోకవలస రాము, మజ్జి వరదరాజులు, పద్ద నేతాజి, రామారావు, ఆఫీసు, రామకృష్ణ, తులుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ భారమై.. గోవులకు గుడ్‌బై!

- అరసవల్లి గోశాలలో 8 ఆవులు ఇతరులకు ఇచ్చేందుకు నిర్ణయం
- భక్తుల నుంచి తీవ్ర విమర్శలు
- అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చు: ఈవో



అప్పగింతకు సిద్ధమైన గోవు

అరసవల్లి : పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారింది అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం పరిస్థితి. డిప్యూటీ కమిషనర్ హోదాలో ఉన్న ఆదిత్యాలయం వార్షికాదాయం సుమారు రూ.20 కోట్లకు చేరుకుంది. అయినా అందుకు తగ్గట్టుగా నిర్వహణ లేదనే చెప్పాలి. భక్తుల సౌకర్యాలు పక్కనపెడితే.. పవిత్రమైన గోమాతలను కూడా పోషించలేమని వాటిని వదిలించుకునేందుకు సిద్ధపడ్డారు. పోషణను భారంగా భావించి గోవులను ఇతరులకు అప్పగించాలని నిర్ణయించడం చర్చనీయాంశమైంది.

భక్తుల అసంతృప్తి..

ఇప్పటికే అనేక వివాదాల చుట్టూ బిగుసుకున్న ఆదిత్యాలయంలో తాజాగా గోవుల తరలింపు నిర్ణయం వివాదాస్పదమవుతోంది. 2002 నుంచి అరసవల్లి ఆలయంలో ఉన్న గోశాలలో పలు గోవులను పోషిస్తూవస్తున్నారు. ఆలయ వార్షిక బడ్జెట్‌లో కూడా ఈమేరకు కేటాయింపులుండటంతో కార్యనిర్వహణాధికారులు ఈ గోశాల అంశంలో వెనక్కితగ్గకుండా నిర్వహించారు. తాజాగా 13 గోవుల్లో (చిన్నవి పెద్దవి కలుపుకుని) ఏకంగా 8 ఆవులను రైతులుగా పేర్కొన్న ఓ నలుగురు ప్రైవేటు వ్యక్తులకు పశుపోషణకు అప్పగిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ పేరిట అధికారిక ప్రకటనను (ఆర్‌సీ-జి/9/2025) బుధవారం విడుదల చేసింది. గోశాలలో గోవులకు ఫల నివేదన చేసి పూజలు చేసిన తర్వాతే స్వామి దర్శనాలకు వచ్చే ఆచారం ఇక్కడ కొనసాగుతోంది. తాజా నిర్ణయంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

స్థల సమస్య పేరిట...

ఆదిత్యాలయంలో పాత గోశాలను తొలగించి 2023 ఆగస్టులో పశ్చిమగోదావరి జిల్లా పెద్దపుల్లేరుకు చెందిన వ్యాపారవేత్త కలిదిండి నరసింహరాజు దంపతులు సుమారు రూ.6 లక్షల సొంత నిధులతో సరికొత్తగా గోశాలను నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రథసప్తమి రాష్ట్ర పండుగ నిర్వహణ ఏర్పాట్లులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో ఆలయం ముందున్న దుకాణాలు, జింక్ షెడ్లు, వసతి గదులు, అన్నదాన మండపం, ప్రసాదాల తయారీ, టికెట్ కౌంటర్లను అనాలోచితంగా కూల్చివేశారు. ఈ క్రమంలోనే కొత్త గోశాలను కూడా కూల్చేసి దగ్గర్లో మరో స్థలంలో అదే మెటీరియల్‌తో గోశాలను నిర్మించారు. ఇక్కడే 13 గోవులు పోషణలో ఉన్నాయి. ఇప్పుడు స్థల సమస్యను కారణంగా చూపుతూ గోవుల సంఖ్యను తగ్గించే చర్యలకు దిగారు. వాస్తవానికి నాలుగు నెలల నుంచి వీటి పోషణకు అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదు. 13 ఆవులకు నెలకు 21 బస్తాల తవుడు, 3 లోడుల గడ్డి అవసరం. కాంట్రాక్టర్ సక్రమంగా తవుడు అందివ్వడం లేదనే కారణంతో పాటు ఒక్కో గడ్డి లోడు రూ.5 వేల వరకు ఉంటుందని.. ఇంత భారం మనకెందుకనే ధోరణిలోనే ఆవులను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే ఎనిమిది ఆవులను పొగాకువానిపేటకు చెందిన బోర బాలకృష్ణ, వాడాడ (కొత్తరెడ్డిపేట)కు చెందిన పంచిరెడ్డి అప్పన్న, వాడాడకు చెందిన రెడ్డి జగన్నాథం, జలుమూరు మండలం బసివాడకు చెందిన అల్లు వెంకటప్పయ్యలకు రెండేసి చొప్పున ఆవులను అప్పగించేందుకు నిర్ణయించారు.

అభ్యంతరాల స్వీకరణ



గోశాలలో స్థలాభావం, శాశ్వత గోశాల లేకపోవడంతో ఉన్న ఆవుల్లో 8 ఆవులను రైతులకు అప్పగించనున్నాం. ఎవరికైనా అభ్యంతరాలుంటే 8978914660 నంబర్‌కు ఏడు రోజుల్లో సంప్రదించి వివరాలు గానీ, అభ్యంతరాలు గానీ తెలియజేయవచ్చు. – కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, ఆలయ ఈవో, అరసవల్లి



అరసవల్లి ఆదిత్యాలయం ఈశాన్య గేటు వద్ద గోశాల

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే



తిమ్మరాజు నీరజ | బూరవెల్లి విజయభారతి | కూర్మాన అరుణకుమారి

శ్రీకాకుళం కల్చరల్/మెళియాపుట్టి/జి.సిగడాం: జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగర పరిధిలోని గుజరాతిపేటలో అంధవరపు వరాహ నరసింహం మున్సిపల్ హైస్కూల్ హిందీపండిట్ తిమ్మరాజు నీరజ, మెళియాపుట్టి మండలం నేలబొంతు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బూరవెల్లి విజయభారతి, జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ కూర్మాన అరుణకుమారిల సేవలను గుర్తిస్తూ ఈ అవార్డులను ఎంపిక చేస్తున్నట్లు ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

- సులువుగా హిందీ భాష బోధించడంలో నీరజ తనవంతు కృషి చేస్తున్నారు. పాటలు, నృత్యాలు, అంత్యాక్షరి రూపంలో సృజనాత్మకంగా బోధిస్తున్నారు.
- విజయభారతి భౌతిక శాస్త్రం పుస్తకాలు రాశారు. జాతీయ స్థాయిలో ప్రత్యేక శిక్షణ పొంది విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు.
- అరుణకుమారి వినూత్న రీతిలో విద్యాబోధన చేపడుతున్నారు. పాఠాలు సులువుగా అర్థమయ్యేలా బోధిస్తుంటారు.

వీరంతా ఈ నెల 5న అమరావతిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డులు పొందనున్నారు. కాగా, మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన మెట్ట మోహనరావు విశాఖ జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. గోపాలపట్నం మండలం లక్ష్మీనగర్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చేతివాటం

- ఎరువుల పేరిట రైతుల వద్ద డబ్బులు వసూలు
- 25 మందికి పింఛనూ ఇవ్వని వైనం
- విచారణ చేపట్టిన ఏడీ



నరసన్నపేట: ఉర్లాం సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గొల్లపల్లి భాస్కరరావు చేతివాటం చూపడంతో అటు రైతులు, ఇటు పింఛనుదారులు లబోదిబోమంటున్నారు. ఉర్లాంకు ఇటీవలే బదిలీపై వచ్చిన భాస్కరరావు వచ్చినప్పటి నుంచి తన తండ్రికి ఆరోగ్యం బాగోలేదని, కేర్ ఆసుపత్రిలో జాయిన్ చేశామని, డబ్బులు అవసరమంటూ స్థానికుల వద్ద రూ.రెండు లక్షలకు పైగా అప్పులు చేసినట్లు సమాచారం. యూరియా, డీఏపీ ఇస్తామని చెప్పి 110 మంది రైతుల నుంచి రూ.1,92,820 వసూలు చేశాడు. 15 రోజులైన ఎరువులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజావీధి, చెరువు గట్టుపై ఉన్న 61 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఆగస్టు 31న రూ.2.52 లక్షలు ఇచ్చారు. అయినా పింఛన్లు పంపిణీ చేయలేదు. కొందరు వృద్ధుల నుంచి వేలిముద్రలు వేయించుకుని డబ్బులు ఇవ్వలేదు. వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లడంతో బుధవారం ఉదయం 36 మందికి ఆదరాబాదరగా పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన 25 మందికి ఇవ్వాల్సిన రూ.1,21,000 తన వద్ద లేవని, ఖర్చయిపోయాయని చెప్పడం గమనార్హం.

ఈ మొత్తం కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో సమయం కోరినట్లు సమాచారం. అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తుండటంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది.

ఎరువు ఇస్తామని వసూలు..

ఉర్లాం ఆర్‌ఎస్‌కే పరిధిలోని రైతుల వద్ద 440 యూరియా బస్తాలు, 50 డీఏపీ బస్తాలకు రూ.1.92,820 లక్షలను భాస్కరరావు వసూలు చేశాడు. యూరియా బస్తాకు రూ.280 చొప్పున, డీఏపీ బస్తాకు రూ.1370 చొప్పున వసూలు చేశాడు. అందరికీ చేతి రసీదులు ఇచ్చారు. వీటిని పట్టుకొని రైతులు ప్రతిరోజూ ఆర్‌ఎస్‌కే, సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. దీంతో బాధిత రైతులు స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ మధు దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆయన ఉర్లాం చేరుకొని సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్ జల్లు చంద్రమౌళి, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు భాస్కరరావు అంగీకరించాడు. దీంతో తమకు ఎరువులు ఇప్పించాలని, లేదా డబ్బులైనా వాపసు చేయాలని రైతులు కోరారు. కాగా శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి నివేదిక పంపనున్నట్లు ఏడీ తెలిపారు.



రైతులు, గ్రామ పెద్దల సమక్షంలో వీఏఏపై విచారణ చేస్తున్న ఏడీ మధు

ఎరువుల కోసం డబ్బులిచ్చా..



ముందుగా డబ్బులు ఇస్తే యూరియా, డీఏపీ తెప్పిస్తానని డబ్బులు కట్టమంటే ఇచ్చాం. 15 రోజులు అవుతున్నా ఇప్పటి వరకూ ఎరువు ఇవ్వలేదు. అడిగితే ఇదుగో అదిగో అని వాయిదాలు వేస్తున్నారు. – చిన్నమ్మడు, చింతువానిపేట

పింఛన్ ఇవ్వలేదు..



పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాం. సచివాలయం చుట్టూ తిరిగాం.మూడు రోజుల నుంచి తిప్పించుకుంటున్నా డబ్బులు ఇవ్వలేదు. తీరా బుధవారం మా పింఛన్ డబ్బు సచివాలయం ఉద్యోగి తినేశాడని అంటున్నారు. మా పింఛన్ మాకు ఇప్పించండి. – ఆదెమ్మ, మహాలక్ష్మి, కళావతి, పింఛన్ లబ్ధిదారులు

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ప్రభాస్ శ్రీను



ఆలయం వెలుపల స్నేహితులతో ప్రభాస్ శ్రీను

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామివారిని సినీ నటుడు పీరు శ్రీనివాస్ (ప్రభాస్ శ్రీను) బుధవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులతో పాటు నరసన్నపేటలో వినాయక చవితి మహోత్సవాలకు హాజరైన ప్రభాస్ శ్రీను.. ఆదిత్యున్ని దర్శించుకొని ఆలయ విశేషాలను స్నేహితులకు వివరించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, సాందీప్‌శర్మల బృందం వారికి వేదాశీర్వచనాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీడీ విమల

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధలు కోరారు. శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ పీడీ ఐ.విమల అధ్యక్షతన జిల్లాలోని 16 ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 16 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పీడీ విమల దృష్టికి తీసుకొచ్చారు. పీడీ విమల మాట్లాడుతూ.. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, రాష్ట్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రీస్కూల్ పిల్లల శాతం పెంచాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు పరిశుభ్రంగా ఉన్నదీ.. లేనిదీ సమీప సచివాలయాల్లో పరీక్ష చేయించి, ఆ నివేదికలను ప్రతివారం తనకు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులందరికీ సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్‌ల నాయకులు కె.సుజాత, పి.లతాదేవి, జె.కాంచన, బి.శాంతమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలి



చెరువులు పరిశీలిస్తున్న అధికారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు

సోంపేట: స్వయం శక్తి సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలని డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మూలపొలం గ్రామంలో సముద్రపు నాచు పెంచే విధానంపై మత్స్యశాఖ, సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సముద్రపు నాచుతో అధిక ఆదాయం పొందవచ్చునని తెలియజేశారు. గతంలో చేపల పెంపకం నిర్వహిస్తున్న మహిళలు, ప్రస్తుతం సముద్రపు నాచు పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సముద్రపు నాచు చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఉదయ్ ఆక్వా తులసీరామ్ పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని పిషిణి గ్రామానికి చెందిన వృద్ధుడు యందువ రామునాయుడు (75) గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపారు. అనారోగ్య కారణాలతో బాధపడుతున్న రామునాయుడు బుధవారం ఉదయం ఇంటి వద్ద గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి రణస్థలం సీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.

భద్రం బీ కేర్ ఫుల్ బ్రదరూ..!



- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసాలు
- అప్రమత్తంగా లేకుంటే ఖాతాలు ఖాళీ

శ్రీకాకుళం క్రైమ్: పెరుగుతున్న సాంకేతికతతో పాటు రోజురోజుకీ సైబర్ మోసాలు పెచ్చుమీరుతున్నాయి. రోజుకో మోసంతో సైబరాసురులు రూ.కోట్లలో భారీగా సొమ్ము కొల్లగొడుతున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు పట్టిపీడించిన ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలే ప్రస్తుతం ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి. ప్రముఖ వైద్యులు, ఉపాధ్యాయ, రాజకీయ, వ్యాపారవర్గాలు, ఇంజినీర్లు సైతం సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకొని దారుణంగా మోసపోతున్నారు. మోసపోయాక పరువు పోతుందేమోనని కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోయినా.. మరి కొందరు భారీ అమౌంట్లు కావడంతో నేరుగా జిల్లా ఉన్నతాధికారి వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ లెక్కకు మించి సైబర్ కేసులు వివిధ స్టేషన్లలో పెండింగ్‌లోనే ఉంటున్నాయి. మరికొన్ని స్టేషన్లలో అయితే కనీసం కేసు కట్టడానికి సాహసించలేని స్థితిలో ఉండడం గమనార్హం.

నమ్మారో.. నట్టేటా మునిగినట్లే..

☛ శ్రీకాకుళం సబ్ డివిజన్ కేంద్రంగా ఇటీవల ఒక ప్రముఖ వైద్యుడు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.37.50 లక్షలు మోసపోయాడు. ఎప్పటినుంచో స్టాక్ మార్కెట్‌లోనే కాకుండా వివిధ మార్గాల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్న ఆ వైద్యుడికి ఒక అపరిచిత వ్యక్తి వాట్సాప్ కాల్‌చేసి చిట్కాలు చెబుతాననడంతో సరే అన్నాడు. ముందుగా ఓ గ్రూపు క్రియేట్ చేసి అందులో సభ్యులను పరిచయం చేశాడు. రూ.10 లక్షలు పెడితే అదనంగా మరో రూ.10 లక్షలు వస్తుందని, రూ.20 లక్షలు పెడితే రూ.20 లక్షలు, రూ.30 లక్షలు పెడితే రూ.30 లక్షలు వస్తుందని మాయమాటలు చెప్పాడు. తన చిట్కాల ద్వారా గ్రూపులో సభ్యులకొస్తున్న అమౌంట్ స్క్రీన్‌షాట్లు తీసి వైద్యుడికి పెట్టసాగాడు. నమ్మకం కుదిరాక వైద్యుడు పలుమార్లు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు.. ఇలా వేస్తూనే ఉన్నాడు.. విత్‌డ్రా ఆప్షన్‌లో డబ్బులు అదనంగా కనిపిస్తుండడం తన అకౌంట్‌లో యాడ్ అవుతున్నట్లు ఆశ పుట్టింది. అలా ఒక రూ.15 లక్షల వరకు వేశాడు. డబ్బులైతే ఆప్షన్‌లో కనిపించి విత్ డ్రా అవ్వకపోవడంతో అపరిచిత వ్యక్తిని అడగగా.. మీరు కడుతుంటే ఒకేసారి వస్తాయనడంతో రూ.37 లక్షల వరకు కట్టేశాడు. కానీ అప్పటికీ విత్ డ్రా అవ్వకపోవడంతో పాటు అపరిచిత వ్యక్తికి ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. గ్రూపులో కూడా వైద్యుడిని రిమూవ్‌చేసేశారు. ఇక చేసేదేమీలేక వైద్యుడు పోలీసులను ఆశ్రయించాడు.

☛ ఇదే తరహాలో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఆర్మీకి చెందిన ఒక వ్యక్తి రూ.కోటికి పైగా సైబరాసురుల చేతిలో నష్టపోయానని ఫిర్యాదు చేయడంతో భారీ అమౌంట్ కావడంతో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నా.. ఇప్పటివరకు కేసు అయితే నమోదు చేయలేకపోయారు.

☛ రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన దుంప కృష్ణ చిత్తూరు జిల్లా మెట్టూరు ఎస్‌బీఐలో ఒప్పంద ఉద్యోగిగా చేస్తున్నాడు. వాట్సాప్ ద్వారా వచ్చే వీడియోలు చూసి సబ్‌స్క్రైబ్ చేసుకున్న కృష్ణకు సైబర్ కేటుగాళ్లు టెలిగ్రామ్ ద్వారా లింకులు పంపించి గేమ్‌లు ఆడించారు. బహుమతులు, డబ్బులొస్తున్నట్లు ఆన్‌లైన్‌లో చూపించడంతో కృష్ణ రూ.11.50 లక్షల వరకు ట్రేడింగ్ చేశాడు. చివరికి డబ్బులు ఎంతకీ అకౌంట్‌లో పడకపోవడంతో జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చిత్తూరు జిల్లా మెట్టూరుకు కేసు బదిలీ చేశారు.

కేసులు నమోదు చేయలేని దుస్థితి

ఈ తరహానే కాకుండా వివిధ సైబర్ మోసాలపై జిల్లాలో భారీస్థాయిలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక్కో స్టేషన్‌లో 4 నుంచి 6 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మోసం చేసే కేటుగాళ్లు వివిధ రాష్ట్రాలు, దేశాలు వారు కావడంతో అక్కడికి వెళ్లి ఆ అధికారులతో సమన్వయం చేసుకుని నోటీసులిచ్చే వరకే చేయగలుగుతున్నారు. ఈలోగా దారి ఖర్చులు, వసతి ఖర్చులు అన్నీ వీరిపైనే భారంగా పడుతున్నాయి. పోనీ కోర్టు వరకు నేరస్తులు వస్తున్నారంటే అదీ లేదు. ఒకట్రెండు సార్లు వచ్చీ ఆ తర్వాత వారి జాడే కనిపించనంతగా మాయమవుతున్నారు. దీంతో ఇటువంటి కేసులు కట్టాలంటేనే తమకు తలనొప్పిగా మారుతున్నాయంటూ కొంతమంది పోలీసు అధికారులే చెబుతుండడం శోచనీయం.

అత్యాశే కారణం



ప్రస్తుతం సైబర్ నేరాలు జిల్లాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. ప్రజలు అత్యాశతో వారి వలలో పడుతున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు వంటి మోసాలకు ఎక్కువగా చదువుకున్నవారే బలవుతున్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో గతంలో కంటే ఇప్పుడు కేసులు ఎక్కువగా నమోదు చేస్తున్నాం. క్షణాల్లో సైబర్ సెల్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసి పోలీసులను, బ్యాంకు ప్రతినిధులను సంప్రదిస్తే మంచిది.

– డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న లక్ష్మణరావు, కేవీజీ సత్యనారాయణ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతకు అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రోడ్డున పారేయాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. కూటమి పాలకులు రైతులకివ్వాల్సిన ఎరువులను ప్రైవేట్ డీలర్లకు అమ్మేసి, వారిచేత కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకోవడం సరికాదన్నారు. కౌలు రైతులను ఆదుకునే నాథుడే లేకుండా పోయారన్నారు. మరోవైపు వికలాంగుల పింఛన్లను తొలగించే చర్యలు చేపట్టడం దారుణమని మండిపడ్డారు. ఇలాంటి చర్యలను విడనాడాలని సూచించారు.

రైతులపై భారం సరికాదు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ మాట్లాడుతూ రైతులను దగా చేసే ప్రభుత్వాలేవీ ఇప్పటివరకు మనుగడలో లేవని గుర్తు చేశారు. ఉచిత పంటల బీమా ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఇవ్వకుండా ఆ భారం రైతులపై వేయడం సరికాదన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు ఇప్పటివరకు ఒక రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పేరుతో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అవినీతికి పాల్పడిన విషయం రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలుసన్నారు. కూటమి కార్యకర్తలు ఇసుక, గ్రావెల్, ఉద్యోగాలు అమ్ముకోవడంతో పాటు చివరికి ఎరువులను సైతం వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, నాయకుడు లోకనాథం పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఇద్దరు సీఐలకు స్థానచలనం కల్పిస్తూ విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. విశాఖరేంజి వీఆర్‌లో ఉన్న ఎన్.సన్యాసినాయుడు పాతపట్నం సర్కిల్‌కు, ప్రస్తుతం పాతపట్నం విధుల్లో ఉన్న సీఐ వానపల్లి రామారావు శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్‌కు రానున్నారు. ఇదివరకు మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన సీఐ టి.త్రినేత్రి గత నెల 31న ఉద్యోగ విరమణ పొందిన సంగతి తెలిసిందే.

ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం



గుప్త(ఫైల్)

నరసన్నపేట: స్థానిక లక్ష్మన్నపేటకు చెందిన వ్యాపారి వెంకట పార్వతీశం గుప్త ఆచూకీ కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు నరసన్నపేట సీఐ ఆఫీస్‌లో మకాం వేసి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి డీఎస్పీ నరసన్నపేటలోనే ఉన్నారు. వినాయక చవితి ముందు రోజు ఈనెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గుప్త ఇంతవరకూ ఇంటికి రాలేదు. దీంతో నరసన్నపేట పోలీసులకు గుప్త సోదరుడు మన్మథరావు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మొదట్లో కేసు నమోదు చేయడంలో స్థానిక పోలీసులు జాప్యం చేశారు. ఆ తర్వాత మాత్రం కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీఐ ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట, పోలాకి ఎస్‌ఐలు సీహెచ్ దుర్గాప్రసాద్, రంజిత్‌లతో పాటు సిబ్బంది దర్యాప్తులో భాగస్వాములయ్యారు.

సీసీ పుటేజీ పరిశీలన

జాతీయ రహదారిపై, టోల్‌గేట్లు వద్దనున్న సీసీటీవీ పుటేజీని పోలీసులు పరిశీలించారు. అదేరోజు సాయంత్రం 2 గంటల నుంచి 4 గంటల సమయంలో తిరుగు ప్రయాణం అయినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. మడపాం టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి కారులో డ్రైవర్ తప్ప గుప్త లేరని సమాచారం. ఈ మేరకు మడపాం టోల్‌గేట్ సీసీ పుటేజీతో పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే గుప్తను నరసన్నపేటలో దించానని డ్రైవర్ చెప్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో డ్రైవర్‌ను అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. బంగారు ఆభరణాలు తీసుకురావడానికి కారులో విశాఖ వెళ్లిన గుప్త, కేజీకి పైగా బంగారు ఆభరణాలు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యారని తెలుస్తోంది. తిరుగు ప్రయాణంలో గుప్త ఏమయ్యారో.. బంగారు ఆభరణాలు ఏమయ్యాయి అనేది తెలియడం లేదు. మరో పక్క కుటుంబ సభ్యులు మన్మథరావుతో పాటు కొందరు వ్యాపారులను బుధవారం విచారించారు. దర్యాప్తు కొనసాగుతుందని కొన్ని చిక్కుముడులు వీడాలని పోలీసులు అంటున్నారు. గుప్త ప్రాణాలతో ఉన్నాడా.. లేదా అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గుప్తతో ఎవరికీ ఎటువంటి గొడవలు లేవని సోదరుడు చెబుతున్నాడు. కాగా గుప్త అదృశ్యమై బుధవారానికి 9 రోజులు అవుతుంది.


కన్నబాబుకు ధర్మాన పరామర్శ



కన్నబాబుతో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వారి కుటుంబాన్ని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు కాకినాడలోని వారి నివాసంలో బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ రాష్ట్ర తూర్పుకాపు అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, నాయకులు బలగ ప్రకాశ్, చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, యాళ్ల శ్రీను, బగ్గు అసిరినాయుడు, రెడ్డి తాతబాబు, గంగు సీతాపతి తదితరులు ఉన్నారు.

అండర్ పాసేజ్‌తో అవస్థలు



రైల్వే అండర్ పాసేజ్‌లోకి చేరిన వర్షపు నీరు

- రోడ్డెక్కిన కవిటి అగ్రహారం గ్రామస్తులు
- రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- పాఠశాల విద్యార్థులతో రైల్వే ట్రాక్ వద్ద ధర్నా



ట్రాక్ దాటి వెళ్తున్న పాఠశాల విద్యార్థులు



కవిటి అగ్రహారం రైల్వే ట్రాక్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: నందిగాం మండలంలోని కవిటి అగ్రహారం గ్రామానికి చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే అండర్ పాసేజ్‌లోకి వరద నీరు ఆరు అడుగుల మేర చేరిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు స్థానిక రైల్వే ట్రాక్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. తమ గ్రామానికి వెళ్లేందుకు పాత లెవిల్ క్రాసింగ్ రహదారిని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. రైల్వేశాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అండర్ పాసేజ్ నిర్మాణం పూర్తిగా ఫెయిల్ అయిందని, ముందుచూపు లేకుండా నిర్మించారని మండిపడ్డారు. వర్షాకాలం వస్తే ఇదే పరిస్థితి ఉంటోందని, చిన్నపాటి వర్షానికే అండర్ పాసేజ్ నిండిపోయి రాకపోకలు నిలిచిపోవడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు రైలు ట్రాక్ దాటి చిన్నారులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, దీనివలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. విషయం తెలుసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు, రైల్వే శాఖ అధికారులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి వచ్చి గ్రామస్తులతో చర్చలు జరిపారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. పెద్ద మోటార్లు తీసుకొచ్చి అండర్ పాసేజ్‌లో నీటిని తోడే ప్రయత్నాలు రైల్వేశాఖ అధికారులు ముమ్మరం చేశారు.

సాదాసీదాగా సలహా కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నేతృత్వంలో బుధవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఏడాది తర్వాత నిర్వహించిన సమావేశంలో భాగంగా ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నియామకాలతో పాటు ఇతర సమస్యలపై కనీస ప్రస్తావన లేకుండా హడావుడిగా కొన్ని మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించి సమావేశాన్ని ముగించేశారు. ముందుగా కలెక్టర్ ఆస్పత్రిలో బాలల సత్వర కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంగణంలో చిన్నారులకు సౌకర్యవంతంగా ర్యాంపులు నిర్మాణం చేయాలని, సుగంధ మొక్కలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఓపీ విభాగం, రక్తనిధి కేంద్రం, వివిధ ల్యాబ్‌లు, డాక్టర్ల విభాగాలతో పాటు మరికొన్ని విభాగాలను పరిశీలించారు. ఆ తర్వాత ఆస్పత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవలను మరింత విస్తరించాలని, దీనికి అవసరమైన సదుపాయాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అయితే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నియామకాలతో పాటు మురుగు వ్యవస్థ ఇతర సమస్యలపై ప్రస్తావన లేకుండా, కొన్ని రకాల అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనపై నిధులు మంజూరు కోసం వివరాలు సేకరించారు. అంతకుముందు ఆస్పత్రిలో సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ పనులను కలెక్టర్ ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఆస్పత్రి గేటు, సోలార్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో నిధుల అంచనాపై కలెక్టర్ ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఆయనతో పాటు సహాయ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్, డీఎంఅండ్‌హెచ్‌వో కె.అనిత, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, వైద్యులు లక్ష్మణరావు, మహారాజ్, రాజశేఖర్, వినోద్, జ్ఞానప్రసూణ తదితరులు పాల్గొన్నారు.

చేతబడి నెపంతో వృద్ధుడి హత్య



మృతుడు ఉంగ రాములు

పలాస: కేశుపురం గ్రామానికి చెందిన వృద్ధుడు ఉంగ రాములు(80) దారుణ హత్యకు గురయ్యాడు. చేతబడి(చిల్లంగి) చేస్తున్నాడనే నెపంతో అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మంగళవారం రాత్రి రాళ్లతో కొట్టి అతి కిరాతకంగా హత్య చేశారు. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశుపురం గ్రామానికి చెందిన అంబలి తులసీరావు పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో బోరుబద్ర గ్రామానికి చెందిన ఓ బూత వైద్యుడిని ఇంటికి పిలుపించుకొని పూజలు చేయించారు. అతను వెళ్లిపోయిన తర్వాత అదేరోజు రాత్రి తులసీరావు కుటుంబ సభ్యులు, బంధువులు ఉంగ రాములు ఇంటికి వెళ్లారు. రాములను బయటకు ఈడ్చుకొచ్చి రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో రాము తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ బుధవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులను కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ సీఐ చెప్పారు.

వానా.. హైరానా

- జిల్లాలోని పలుచోట్ల ముంచెత్తిన వర్షం



వజ్రపుకొత్తూరు రూరల్: కిస్టిపురం అండర్ పాసేజ్ బ్రిడ్జిలోకి చేరిన వరద నీరు



నరసన్నపేట: ఆలయంలోకి చేరిన నీరు



పాతపట్నం: నీలకంఠేశ్వర ఆలయం వద్ద కాజ్‌వేపై పారుతున్న వరద నీరు



టెక్కలి: పెద్దరోకళ్లపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు ముంచెత్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు, చెరువులు, రోడ్లు, పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి ప్రాథమిక పాఠశాలలోకి, పూండి గల్లిలోని పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. గరుడఖండి – బ్రహ్మణతర్లా వద్ద ఉన్న అండర్ పాసేజ్ బ్రిడ్జి నీటితో నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నరసన్నపేట మండలంలోని గొట్టిపల్లి మార్గంలో ఉన్న స్వయంభూ ఉమామహేశ్వర స్వామి ఆలయం వర్షానికి నీట మునిగింది. దీంతో భక్తులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లి గ్రామ సమీపంలో గెడ్డ ప్రవాహం ఉధృతంగా మారింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పాతపట్నంలో మహేంద్రతనయా నది పొంగిపొర్లుతోంది. పాతపట్నం నీలకంఠేశ్వరం ఆలయం వద్ద ఉన్న కాజ్‌వే బ్రిడ్జిపై నుంచి రెండు అడుగుల నీరు పారుతోంది.

– సాక్షి నెట్‌వర్క్